




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 9 సంచిక : 316 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | శనివారం 18 జూలై 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :316 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | SAT 18 JULY 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## వ్యవసాయంపై లోకేశ్ కు కనీస అవగాహన లేదు

- తాను చెప్పే ఐదు మొక్కల పేర్లు చెప్పాలని లోకేశ్ కి సవాల్
- పేర్లు చెబితే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్
- కూటమి ప్రభుత్వంలో అవినీతి అక్రమాలు రాజ్యమేలుతున్నాయని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వం, మంత్రి లోకేశ్ పై మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వ్యవసాయంపై లోకేశ్ కు కనీస అవగాహన లేదని ఆయన ఎద్దేవా చేశారు. అంతేకాదు తాను చూపించే ఏవైనా ఐదు వ్యవసాయ

- మిగతా 2లో






## డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యం

- హైదరాబాద్‌ను చూసిన ప్రతిసారి అసూయ కలుగుతుంది... అదే నాలో కసిని పెంచింది: మంగళగిరిలో మంత్రి నారా లోకేశ్
- మంగళగిరిలో రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవంలో మంత్రి నారా లోకేశ్ ప్రసంగం
- 91 వేల మెజారిటీతో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని భావోద్వేగ ప్రసంగం
- అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మిస్తామని, పెట్టుబడులు ఆకర్షిస్తామని హామీ

పెన్ పవర్ డెస్క్:"హైదరాబాద్‌ను చూసిన ప్రతిసారీ నాకు అసూయ కలుగుతుంది. అక్కడి విమానాశ్రయం, రైల్వే స్టేషన్లు, ఐటీ టవర్లు చూసినప్పుడు కలిగే ఆ అసూయే.. నాలో కసిని పెంచింది. ఆంధ్రప్రదేశ్‌ను దక్షిణ భారతదేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దగలమన్న నమ్మకాన్ని ఇచ్చింది"

- మిగతా 2లో



### యుద్ధం కొనసాగుతున్నా..

## భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉంది

- పశ్చిమాసియా ఉద్రిక్తతలు, రుతుపవనాల ముప్పును ప్రస్తావించిన ఆర్‌బీఐ గవర్నర్
- అయినా భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని మల్హోత్రా ధీమా
- రూపాయి పరిస్థితి సహజమేనని వివరణ
- వాణిజ్య ఒప్పందాలు ఎగుమతులకు ఊతమిస్తాయని భరోసా
- రిటైల్ ద్రవ్యోల్బణం 4 శాతం పరిధిలోనే ఉందని వెల్లడి

- మిగతా 2లో

### అమరావతిలో రోడ్లు, బిల్డింగ్‌లు పూర్తయ్యేలోపు

## టూరిజం ప్రాజెక్ట్స్ రెడీ కావాలి



### మంత్రి నారాయణ డెడ్‌లైన్!

- అమ్యూజ్‌మెంట్ పార్క్, ఎకో టూరిజం పార్కులను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయనున్న ప్రభుత్వం
- అమరావతిలో రోడ్లు, భవనాలు పూర్తయ్యేలోపు టూరిజం ప్రాజెక్టులు పూర్తి కావాలన్న నారాయణ
- పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని ఆదేశం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని కేవలం పరిపాలనా నగరంగానే కాకుండా, అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా మార్చేందుకు

- మిగతా 2లో

## జగన్ పాలనలో అదే పట్టిసీమ దిక్కయింది

- పట్టిసీమను జగన్ వట్టిసీమ అన్నారన్న దేవినేని ఉమా
- జగన్ అధికారంలోకి వచ్చాక అదే పట్టిసీమ ద్వారా నీరు ఇవ్వాల్సి వచ్చిందని ఎద్దేవా
- పులివెందులకు కూడా చంద్రబాబు నీరు ఇచ్చారని వ్యాఖ్య




పెన్ పవర్ డెస్క్:గంగా-కావేరి నదుల అనుసంధానంపై డాక్టర్ కేఎల్ రావు కలగన్నారని... ఆ స్ఫూర్తితోనే సీఎం చంద్రబాబు గోదావరి-కృష్ణ నదుల అనుసంధానాన్ని పట్టిసీమ ద్వారా సాకారం చేశారని మాజీ మంత్రి దేవినేని ఉమా వెల్లడించారు. గతంలో జగన్ పట్టిసీమను 'వట్టిసీమ' అని విమర్శించారని... ఆయన పాలనలో అదే పట్టిసీమ ద్వారా

- మిగతా 2లో

## మోదీ, చంద్రబాబు వచ్చాక పరిస్థితులు మారాయి

### నరసరావుపేటలో నిర్మలా సీతారామన్

- నరసరావుపేటలో బ్యాంకుల రుణమేళా
- హాజరైన నిర్మలా సీతారామన్, చంద్రబాబు
- 2014కు ముందు తమకు కావాల్సిన వారికి రుణాలు ఇప్పించుకునేవారన్న నిర్మల
- ప్రస్తుతం అర్హత ఆధారంగానే రుణాలు ఇస్తున్నట్టు వెల్లడి
- వీధి వ్యాపారులకు ప్రభుత్వమే గ్యారెంటీగా నిలుస్తోందని స్పష్టీకరణ

- మిగతా 2లో





## త్వరలోనే ఫడ్నవీస్ సీఎం పదవికి రాజీనామా చేస్తారు

- త్వరలోనే మోదీ కేబినెట్ విస్తరణ జరిగే అవకాశం ఉందన్న సంజయ్ రౌత్
- ఫడ్నవీస్‌కు కేంద్ర మంత్రివర్గంలో కీలక బాధ్యతలు ఇస్తారని జోస్యం
- మహారాష్ట్రకు బీజేపీకి చెందిన మరోనేత సీఎం అవుతారని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:మహారాష్ట్ర రాజకీయాల్లో మరోసారి దుమారం రేపేలా శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే) వర్గం ఫైర్‌బ్రాండ్ ఎంపీ సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ త్వరలోనే తన పదవికి రాజీనామా

- మిగతా 2లో

## త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు.. కీలక ప్రయోగానికి ఆర్బీఐ సిద్ధం!

- త్వరలో పాలిమర్ కరెన్సీ నోట్ల ప్రయోగానికి ఆర్బీఐ శ్రీకారం!
- మొదటగా రూ. 10, రూ. వ20 డినామినేషన్లలో పైలట్ ప్రాజెక్టు
- కాగితం నోట్ల కంటే ఎక్కువ మన్నిక, భద్రత కలిగిన పాలిమర్ నోట్లు
- ప్రస్తుత కాగితం నోట్లు యథావిధిగా చలామణి
- 2027 నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చే అవకాశం




పెన్ పవర్ డెస్క్: దేశంలో పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టే దిశగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) కసరత్తు చేస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ పైలట్ ప్రాజెక్టును త్వరలోనే ప్రారంభించి, 2027 నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

- మిగతా 2లో

## మెక్సికోలో భారీ భూకంపం.. 7.3గా నమోదైన తీవ్రత




- మెక్సికో దక్షిణ పసిఫిక్ తీరంలో భారీ భూకంపం
- రిక్టర్ స్కేలుపై 7.3గా నమోదైన భూకంప తీవ్రత
- గ్వాటెమాలా, ఎల్ సాల్వడార్ వరకు కంపించిన భూమి

పెన్ పవర్ డెస్క్:మెక్సికో దక్షిణ పసిఫిక్ తీర ప్రాంతంలో భారీ భూకంపం సంభవించింది. గ్వాటెమాలా సరిహద్దుకు సమీపంలో చోటుచేసుకున్న ఈ భూప్రకంపనల ప్రభావం మెక్సికో సిటీతో పాటు ఎల్ సాల్వడార్ వరకు విస్తరించింది. యూఎస్ జియోలాజికల్ సర్వే నివేదిక ప్రకారం, రిక్టర్ స్కేలుపై ఈ భూకంప తీవ్రత 7.3గా నమోదైంది. చియాపాస్ తీరానికి సమీపంలోని అఖిలెస్ సెర్డాన్‌కు నైరుతి దిశగా 48 కిలోమీటర్ల

- మిగతా 2లో




## పొత్తులే కత్తులుగా మారతాయా? చంద్రబాబుకు అతి పెద్ద ఛాలెంజ్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో నిజమైన ఛాలెంజ్ ను ఎదుర్కొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదీ ప్రత్యర్థి వైసీపీ నుంచి మాత్రం కాదు. కేవలం సొంత పార్టీలోని నేతల నుంచే. అనేక నియోజకవర్గాల్లో ఇప్పటికే నాయకత్వంలో గ్రూపులుగా విడిపోయి ఉన్నారు. పదవుల కోసం పోరాడి.. పోరాడి రెండేళ్ల నుంచి అలసి పోయి ఉన్నారు. వారందరినీ ఒక చోట చేర్చి అందరినీ మెప్పించి ఒక బాటలో పయనించేలా చేయడం కత్తిమీద మీద సామే అవుతుందని మాత్రం చెప్పాలి. ముఖ్యంగా కూటమి పార్టీలోని మిగిలిన మిత్ర పక్షాలు గెలిచిన స్థానాల్లోనూ ఎవరి మధ్య సఖ్యత లేదు. ఎవరి దారి వారిదే లాగా ఉంది.

**పొత్తులో భాగంగా...**

ఇప్పటికే పొత్తులో భాగంగా ఎమ్మెల్యే సీటును కోల్పోయిన తమకు మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఛైర్మన్ పదవులను ఖచ్చితంగా మిత్ర పక్షాలు గెలిచిన నియోజకవర్గాల్లో టీడీపీ ఇన్ చార్జులు డిమాండ్ చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అయితే అక్కడ ఉన్న ఎమ్మెల్యే అందుకు ఒప్పుకునే పరిస్థితి ఉంటుందా? అన్నది కూడా అనుమానమే. వార్డు మెంబర్ల నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల నుంచి టీడీపీ స్థానిక నేతల నుంచి చంద్రబాబు ఒత్తిడిని ఎదుర్కొంటారు. ఎమ్మెల్యే సీటు తమకు ఇవ్వకపోయినా తాము కూటమి ధర్మాన్ని పాటించి మద్దతు ఇచ్చి గెలుపులో ముఖ్యపాత్ర వహించినప్పటికీ, గెలిచిన తర్వాత మాత్రం తమను పట్టించుకోవడం లేదని అనేక నియోజకవర్గాల నుంచి ఇప్పటికే పార్టీ నాయకత్వానికి ఫిర్యాదులు అందుతున్నాయి.

**పదవుల కోసం ఘర్షణలు...**

ఇటీవల తిరుపతి పట్టణంలో జరిగిన తంబళ్లపల్లి, పుంగనూరు నియోజకవర్గంలోనే ఇన్ ఛార్జి పదవి కోసం నేతల తరుపున కార్యకర్తలు ఘర్షణలకు దిగడాన్ని చూశాం. ఇక స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో రాజీ పడకపోవచ్చు. వీరందరినీ సముదాయించడం చంద్రబాబుకు ఆషామాషీ కాదు. అలాగని జిల్లా ఇన్ ఛార్జి మంత్రులపై ఈ భారాన్ని మోపితే వారు ఒత్తిడికి గురయి వదిలేస్తారు. నారా లోకేశ్ చేయి వేసినా వారందరినీ ఒక బాటలో పయనించేలా చేయడం కష్టంగానే కనిపిస్తుంది. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలు అధికారంలో ఉన్న చంద్రబాబుకు అతి పెద్ద సమస్యగా మారే అవకాశముంది. ఒకవేళ మిత్ర పక్షాలకు ఇచ్చిన చోట ఒకరినొకరు సహకరించుకునే పరిస్థితి ఉండదు. మరి ఈ పరిస్థితి నుంచి పార్టీని ఎలా బయటపడేస్తారన్నది చూడాలి.

## వ్యవసాయంపై లోకేశ్ కు కనీస అవగాహన లేదు

- మొదటి పేజి తరువాయి

మొక్కల పేర్లను ఆయన సరిగ్గా చెబితే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని కాకాణి సవాల్ విసిరారు. చంద్రబాబు ప్రభుత్వం కేవలం దోపిడీయే పరమావధిగా పాలిస్తోందన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి ఆదాయ వనరులు సమకూరితే, ప్రస్తుతం చంద్రబాబు వాటిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని కాకాణి దుయ్యబట్టారు. వైసీపీ హయాంలో నిర్మించిన రామాయపట్నం పోర్టును ఈ ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడమే ఇందుకు నిదర్శనమని కాకాణి విమర్శించారు. ఈ ప్రభుత్వంలో గ్రావెల్ తవ్వకాల నుంచి నిరుద్యోగుల డీఎస్సీ నోటిఫికేషన్ వరకు ప్రతి ఒక్క విషయంలోనూ అవినీతి అక్రమాలు రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. ప్రతి పథకంలోనూ, ప్రభుత్వ నిర్ణయంలోనూ పారదర్శకత లోపించిందన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను, అవినీతిని ప్రజలందరూ గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. వ్యవసాయ రంగం, రాష్ట్ర అభివృద్ధి అంశాలపై కాకాణి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతున్నాయి.

## అమరావతిలో రోడ్లు, బిల్డింగ్‌లు పూర్తయ్యేలోపు టూరిజం ప్రాజెక్ట్స్ రెడీ కావాలి

- మొదటి పేజి తరువాయి

కూటమి ప్రభు త్వం కసరత్తులు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా కృష్ణా నదీ తీరాన 'రివర్ ఫ్రంట్ టూరిజం' అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది.అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులతో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ శుక్రవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ భేటీలో ఏడీసీఎల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారథితో పాటు పలువురు కీలక అధికారులు పాల్గొన్నారు.

**ఈ సమీక్షా సమావేశం ముఖ్యాంశాలు:**

పీపీపీ విధానంలో పార్కుల అభివృద్ధి: అమరావతిలో సరికొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించేలా భారీ 'అమ్యూజ్‌మెంట్ పార్క్', పర్యావరణాన్ని ప్రతిబింబించేలా 'ఎకో టూరిజం పార్కు'లను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ ) పద్ధతిలో అభివృద్ధి చేయాలని ఏడీసీఎల్ నిర్ణయించింది.

మంత్రి నారాయణ డెడ్‌లైన్: రాజధాని పరిధిలో ప్రధాన రహదారులు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు ఒక కొలిక్కి వచ్చే సమయానికే.. సమాంతరంగా ఈ పర్యాటక ప్రాజెక్టులన్నీ కూడా పూర్తి కావాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సీఎం చంద్రబాబు విజన్: ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మార్గదర్శకాలు, సూచనలకు అనుగుణంగా.. దేశ విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా ప్రాజెక్ట్ డిజైన్లు ఉండాలని, పనుల్లో వేగం పెంచాలని మంత్రి స్పష్టం చేశారు.రైతులకు, పర్యాటకులకు అనుకూలంగా ఉండేలా ఇప్పటికే టూరిజం ప్రాజెక్టుల కోసం భూములు తీసుకున్న ఇతర ప్రైవేట్ సంస్థలు కూడా కాలయాపన చేయకుండా తక్షణమే తమ నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి నారాయణ సూచించారు. తాజా సమీక్షతో అమరావతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులకు మరింత ఊపు రానుంది.

## త్వరలోనే ఫడ్నవీస్ సీఎం పదవికి రాజీనామా చేస్తారు

- మొదటి పేజి తరువాయి

చేసి, ఢిల్లీ బాట పట్టబోతున్నారంటూ ఆయన జోస్యం చెప్పారు. రాబోయే ఒకటి లేదా రెండు నెలల్లో కేంద్రంలో మోదీ కేబినెట్ విస్తరణ జరిగే అవకాశం ఉందని, అదే జరిగితే మహారాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు ఖాయమని సంజయ్ రౌత్ పేర్కొన్నారు. సీఎం ఫడ్నవీస్‌ను ఢిల్లీకి పిలిపించి కేంద్ర మంత్రివర్గంలో కీలక బాధ్యతలు అప్పగిస్తారని, ఆయన స్థానంలో బీజేపీకి చెందిన ఒక సీనియర్ నేతను మహారాష్ట్ర ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెడతారని సంచలన వ్యాఖ్యలు చేశారు. శివసేన (ఖదీ) ప్రతిష్ఠాత్మకంగా చేపట్టబోతున్న 'రామ రక్షా ఆందోళన్' సన్నాహకాలను పర్యవేక్షించేందుకు నాగ్‌పూర్ వెళ్లిన సంజయ్ రౌత్.. అక్కడి నుంచే ఈ పొలిటికల్ బాంబ్ పేల్చారు.

# గత విధ్వంసం నుంచి ఏపీని కేంద్రమే నిలబెట్టింది

గత ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వమే నిలబెట్టిందని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రం అందించిన సహకారంతోనే రాష్ట్రం తిరిగి గాడిన పడుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ఆయన 'క్రెడిట్ అవుట్ రీచ్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్రం అందిస్తున్న చేయూత వల్లే రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతోందని అన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలోనూ కేంద్రం రాష్ట్రానికి అండగా నిలిచిందని గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాల కింద 1,03,246 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ రూ.3,216 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. అనంతరం బాలికలకు సైకిళ్లను అందజేశారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అంతిమ లక్ష్యం ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమేనని అన్నారు. ఒకప్పుడు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు బ్యాంకులే ప్రజల వద్దకు వచ్చి రుణాలు ఇవ్వడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ రుణమేళా ద్వారా వ్యవసాయ రంగానికి రూ.2,363 కోట్లు, ఎంఎస్ఎంఈలకు రూ.325 కోట్లు, గృహ, విద్య, ఇతర రంగాలకు రూ.624 కోట్లు అందించినట్లు వివరించారు.కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నాయకత్వ పటిమను చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంసించారు. దేశంలో మొండి బకాయిలపై (ఛీూా) కఠినంగా వ్యవహరించి, డిజిటల్ బ్యాంకింగ్ విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. జీఎస్టీ విధానంలో మార్పులు చేసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచారని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన అధిక వడ్డీ అప్పులను కేంద్రం సహకారంతో రీషెడ్యూల్ చేశామని, దీని ద్వారా రాష్ట్రానికి రూ.1,538 కోట్ల మేర ఆదా అయిందని తెలిపారు.

రాయలసీమను హార్టికల్చర్ హబ్?గా మార్చేందుకు కేంద్రం రూ.40 వేల కోట్ల సహకారం అందిస్తోందని, ప్రైవేటు పెట్టుబడులతో ఈ ప్రాంతాన్ని ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలు పొదుపులో, రుణాల చెల్లింపులో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని, వారిని వ్యాపారవేత్తలుగా మార్చేందుకు 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## యుద్ధం కొనసాగుతున్నా.. భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉంది

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, బలహీన రుతుపవనాల ముప్పు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ముందుకు సాగుతోందని చెప్పారు. అయితే అంతర్జాతీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం వేచి చూసే ధోరణిని అనుసరించాల్సిన అవసరం ఉందని సూచించారు. దూరదర్శన్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఇరాన్ యుద్ధం తర్వాత అమెరికా డాలర్ బలపడిందని మల్హోత్రా తెలిపారు. దీంతో అనేక దేశాల కరెన్సీలు బలహీనపడ్డాయని చెప్పారు. ప్రపంచ పరిస్థితులతో పోలిస్తే రూపాయి విలువలో వచ్చిన మార్పు సహజంగానే ఉందని స్పష్టం చేశారు. రూపాయి పనితీరుపై ఆందోళన అవసరం లేదని పేర్కొన్నారు.భారత విదేశీ వాణిజ్యం బలంగానే కొనసాగుతోందని ఆర్‌బీఐ గవర్నర్ వెల్లడించారు. సేవల ఎగుమతులు, విదేశాల్లో ఉన్న భారతీయుల నుంచి వచ్చే నగదు, రికార్డు స్థాయి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు దేశానికి అండగా నిలుస్తున్నాయని చెప్పారు. బ్రిటన్‌తో కుదిరిన వాణిజ్య ఒప్పందం, యూరోపియన్ యూనియన్, అమెరికాతో కొనసాగుతున్న చర్చలు కూడా ఎగుమతులకు ఊతమిస్తాయని వివరించారు.సరఫరా సంబంధిత కారణాల వల్లే ఇటీవల ద్రవ్యోల్బణం పెరిగిందని మల్హోత్రా తెలిపారు. ప్రస్తుతం రిటైల్ ద్రవ్యోల్బణం

4 శాతం పరిధిలోనే ఉందని చెప్పారు. ధరల స్థిరత్వంతో పాటు ఆర్థిక వృద్ధి మధ్య సమతుల్యం కాపాడే దిశగా ఆర్‌బీఐ చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. అందుకే ఈ ఏడాది ఇప్పటివరకు కీలక వడ్డీ రేటును 5.25 శాతం వద్దే కొనసాగించినట్లు పేర్కొన్నారు.అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మళ్లీ పెరుగుతున్నాయని మల్హోత్రా గుర్తుచేశారు. భారత్ తన అవసరాల్లో దాదాపు 88 శాతం ముడి చమురును దిగుమతి చేసుకుంటోందని చెప్పారు. చమురు ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం, కరెంట్ అకౌంట్ లోటుపై ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఆగస్టు 3 నుంచి 5 వరకు జరిగే ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో తాజా ఆర్థిక పరిస్థితులను సమీక్షించి వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.

## త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు.. కీలక ప్రయోగానికి ఆర్బీఐ సిద్ధం!

- మొదటి పేజి తరువాయి

తొలి దశలో భాగంగా రూ. 10, రూ. 20 వంటి తక్కువ ముఖ విలువ కలిగిన నోట్లతో ఈ ప్రయోగాన్ని ప్రారంభించాలని ఆర్బీఐ యోచిస్తోంది. ప్రస్తుతం చలామణిలో ఉన్న కాగితపు నోట్లను రద్దు చేయకుండానే, దశలవారీగా ఈ కొత్త పాలిమర్ నోట్లను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందులో భాగంగా అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో కూడిన పాలిమర్ షీట్లను సరఫరా చేసేందుకు ఆర్బీఐ నోట్ల ముద్రణ విభాగం ఇప్పటికే గ్లోబల్ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈవోఐ) జారీ చేసింది. బిడ్లు దాఖలుకు ఆగస్టు 18ని తుది గడువుగా నిర్ణయించింది.

దేశంలో యూపీఐ వంటి డిజిటల్ చెల్లింపులు గణనీయంగా పెరిగినప్పటికీ, నగదు వినియోగం మాత్రం తగ్గలేదు. దీనికి తోడు పాత నోట్ల స్థానంలో కొత్త వాటిని ముద్రించడం వల్ల ముద్రణా వ్యయం భారంగా మారుతోంది. ఈ నేపథ్యంలో కాటన్‌తో తయారు చేసే కాగితపు నోట్లకు బదులు, ప్లాస్టిక్ ఆధారిత పాలిమర్ నోట్లను తీసుకురావడం ద్వారా ఖర్చును తగ్గించుకోవచ్చని ఆర్బీఐ భావిస్తోంది. ఈ నోట్లు ఎక్కువ కాలం మన్నడమే కాకుండా నీరు, మురికి వంటి వాటికి త్వరగా పాడవవు. ఇప్పటికే ఆస్ట్రేలియా, యూకే, కెనడా వంటి దేశాల్లో ఇవి విజయవంతంగా చలామణిలో ఉన్నాయి.గతంలో 2012-14 మధ్య కాలంలోనే ఆర్బీఐ ఈ ప్రతిపాదన చేసినప్పటికీ, కొన్ని సాంకేతిక కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు మళ్లీ ఈ అంశంపై దృష్టి సారించిన కేంద్ర బ్యాంక్, ఏటీఎంలలో వీటి అనుకూలత వంటి సాంకేతిక అంశాలను పరిశీలిస్తూ పైలట్ ప్రాజెక్టుకు సిద్ధమవుతోంది. అయితే, దీనిపై ఆర్బీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## మోదీ, చంద్రబాబు వచ్చాక పరిస్థితులు మారాయి

ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు లాంటి నేతలు అధికారంలోకి వచ్చాక దేశంలో పరిస్థితులు పూర్తిగా మారాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. గతంలో ఫోన్ బ్యాంకింగ్ ద్వారా ఎవరికి రుణాలు ఇవ్వాలో నిర్దేశించే వారని, కానీ ఇప్పుడు బ్యాంకులు నేరుగా ప్రజల వద్దకే వెళ్లి అర్హులైన వారికి అండగా నిలుస్తున్నాయని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో ప్రభుత్వ రంగ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించిన 'క్రెడిట్ అవుట్‌రీచ్' కార్యక్రమంలో ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు బ్యాంకుల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, బ్యాంకులు ప్రజల వద్దకు వెళ్లి సేవలు అందించాలన్నది ప్రధాని మోదీ ఆలోచన అని తెలిపారు. 2004 నుంచి 2014 మధ్య కేంద్రంలో ఉన్న ప్రభుత్వం, ఫోన్ కాల్స్ ద్వారా తమకు కావాల్సిన వారికి రుణాలు ఇప్పించుకునేదని, కానీ ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక ఆ విధానానికి స్వస్తి పలికిందని విమర్శించారు. ప్రస్తుతం గ్రామగ్రామాన బ్యాంకులు పర్యటించి, ఎలాంటి హామీ లేకుండా అర్హత ఉన్నవారికి రుణాలు అందిస్తున్నాయని చెప్పారు. వీధి వ్యాపారులకు సైతం ప్రభుత్వమే గ్యారెంటీ ఇచ్చి వారి వ్యాపారాలకు చేయూతనిస్తోందని వివరించారు. అధిక వడ్డీలకు అప్పులిచ్చే వ్యాపారుల బారిన పడకుండా మైక్రో ఫైనాన్స్ ద్వారా మహిళలు, చిరు వ్యాపారులను ఆదుకోవడమే తమ లక్ష్యమన్నారు.దేశవ్యాప్తంగా బ్యాంకులు తమ పనితీరును, ప్రజలు బ్యాంకుల పట్ల తమ దృక్పథాన్ని మార్చుకున్నారని, నరసరావుపేటలో జరిగిన ఈ రుణమేళానే దానికి నిదర్శనమని అన్నారు. వ్యాపారవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కోట్లాది రూపాయల రుణాన్ని బ్యాంకులు అందించాయని తెలిపారు. 2047 నాటికి భారతదేశాన్ని అగ్రగామి అభివృద్ధి చెందిన దేశంగా, 'వికసిత్ భారత్'గా నిలబెట్టడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఆమె పునరుద్ఘాటించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమకూర్చిన అంబులెన్స్‌లను సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బాలికలకు సైకిళ్లను పంపిణీ చేసి, వివిధ రంగాలకు చెందిన లబ్ధిదారులకు రుణాలను వితరణ చేశారు.

## జగన్ పాలనలో అదే పట్టిసీమ దిక్కయింది

- మొదటి పేజి తరువాయి

నీటిని ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని వ్యంగ్యంగా అన్నారు. ఇది దేవుడు రాసిన స్క్రిప్ట్ అని చెప్పారు.

పట్టిసీమ, అమరావతి నిర్మాణాల్లో జగన్ అడ్డంకులు సృష్టించి రాష్ట్రాభివృద్ధికి ఆటంకం కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు అకుంఠిత దీక్షతో మార్చి 2025లో పట్టిసీమ పనులు ప్రారంభించి, సెప్టెంబర్‌లోనే తొలి విడతగా కొంత నీటిని డెల్టాకు నీరందించారని తెలిపారు. పులివెందులకు కూడా చంద్రబాబు నీరు ఇచ్చారని అన్నారు.

పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీరు అందడం వల్ల చౌడు భూములు సారవంతంగా మారి, ఎకరాకు దిగుబడి 50 నుంచి 60 బస్తాలకు

పెరిగిందన్నారు. సాగు నీరు సమృద్ధిగా అందడం వల్ల ఎరువుల ఖర్చు తగ్గి రైతుల ఆదాయం పెరిగిందని, రాయలసీమ నేడు హార్టికల్చర్ రంగంలో అద్భుతాలు చేస్తోందని ఉమా వివరించారు.

## మెక్సికోలో భారీ భూకంపం.. 7.3గా నమోదైన తీవ్రత

- మొదటి పేజి తరువాయి

దూరంలో, భూ అంతర్భాగంలో 15 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. ఈ ప్రధాన భూకంపానికి ముందు సముద్ర గర్భంలో స్వల్ప స్థాయిలో ప్రకంపనలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.భూకంప తీవ్రతకు ప్రజలు తీవ్ర భయాందోళనకు గురై ఇళ్ల నుంచి వీధుల్లోకి పరుగులు తీశారు. మెక్సికో, గ్వాటెమాలా సరిహద్దుల్లోని సుచియాటే నగరంలో సునామీ ముప్పు పొంచి ఉందనే అనుమానంతో తీర ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు మేయర్ ఎల్మర్ పేర్కొన్నారు. మెక్సికో దక్షిణ సరిహద్దులోని కీలక నగరమైన టపచులాలో తొలుత స్వల్పంగా ప్రారంభమైన ప్రకంపనలు, కొద్దిసేపటికే తీవ్రరూపం దాల్చాయి.

"మేము ఆసుపత్రిలోని రెండో అంతస్తులో ఉన్న సమయంలో భూమి కంపించడం మొదలైంది. తొలుత ఇది సాధారణ ప్రకంపనలే అని భావించాం, కానీ తీవ్రత పెరగడంతో అప్రమత్తమై భవనం నుంచి బయటకు వచ్చేశాం" అని ఓ ఉద్యోగిని అసోసియేటెడ్ ప్రెస్ ప్రతినిధికి వివరించారు.

గ్వాటెమాలా సిటీలో భూప్రకంపనలు దీర్ఘకాలం పాటు కొనసాగడంతో జనం ఆందోళన చెందారు. మెక్సికో సిటీలోని పలు ప్రాంతాల్లో భవనాలు ఒక్కసారిగా ఊగిపోయాయి. అయితే, భూకంపం సంభవించిన ప్రారంభ క్షణాల్లో దాని తీవ్రత నిర్దేశిత పరిమితిని మించకపోవడం వల్ల ఎర్త్‌క్వేక్ అలర్ట్ సిస్టమ్ మోగలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యం

- మొదటి పేజి తరువాయి

అని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ శక్తిమంతమైన ప్రసంగం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్ విధానంలో ప్రారంభించిన ఆధునిక హంగులతో కూడిన మంగళగిరి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ సభలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తన ప్రసంగంలో అభివృద్ధి, రాజకీయాలు, వ్యక్తిగత ప్రస్థానాన్ని కలగలిపి, ప్రజల్లో నూతనోత్సాహం నింపారు.ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో రైల్వే వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని లోకేశ్ కొనియాడారు. "ఒకప్పుడు రైళ్లు సమయానికి వచ్చేవి కావు, బోగీలు శుభ్రంగా ఉండేవి కావు. కానీ నేడు వందే భారత్, బుల్లెట్ రైళ్లు, కవచ్ భద్రతా టెక్నాలజీ, 100 శాతం విద్యుదీకరణతో రైల్వే రంగం స్వరూపమే మారిపోయింది. దేశాభివృద్ధికి రైల్వేలే కీలకమని ప్రధాని మోదీ బలంగా విశ్వసిస్తున్నారు" అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళగిరిలో మరిన్ని రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను సభాముఖంగా కోరారు.అమరావతి అభివృద్ధిపై లోకేశ్ తన దార్శనికతను స్పష్టం చేశారు. "రాజధాని అమరావతికి రోడ్డు, రైలు, వాయు మార్గాల అనుసంధానం అత్యంత కీలకం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ఈ మూడింటినీ అనుసంధానిస్తూ ఒక ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను రూపొందిస్తున్నారు. 2019-24 మధ్య ఆగిపోయిన అమరావతి పనులను ఇప్పుడు చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారు పరుగులు పెట్టిస్తున్నారు. అమరావతిని ఒక గ్లోబల్ సిటీగా మార్చడమే మా అందరి లక్ష్యం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ఉన్న 'డబుల్ ఇంజన్ సర్కార్'తోనే ఇది సాధ్యమని ఆయన అన్నారు. దశాబ్దాల కల అయిన విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌ను ప్రధాని మోదీ ఆచరణలోకి తెచ్చారని గుర్తుచేశారు.ఈ సందర్భంగా మంగళగిరితో తనకున్న అనుబంధాన్ని, రాజకీయ ప్రయాణాన్ని లోకేశ్ భావోద్వేగంగా పంచుకున్నారు. "2019లో 5,300 ఓట్లతో ఓడిపోయినప్పుడు కుంగిపోలేదు. ఐదేళ్లు మీ మధ్యనే ఉన్నా, చెమటోడ్చి కష్టపడ్డా, మీ మనసు గెలుచుకున్నా. నేను ఏ మెజారిటీతో అయితే ఓడిపోయానో, దాని పక్కన ఒక సున్నా పెట్టి గెలిపించాలని కోరాను. మీరు నా మాట నిలబెట్టారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే టాప్-3 మెజారిటీతో, 91 వేల ఓట్ల ఆధిక్యంతో నన్ను గెలిపించి శాసనసభకు పంపించారు. ఈ గెలుపు నాకు కొండంత బలాన్నిచ్చింది, నాపై బాధ్యతను పెంచింది" అని అన్నారు. ఈ మెజారిటీని చూపించే కేంద్ర, రాష్ట్ర మంత్రులపై ఒత్తిడి తెచ్చి నియోజకవర్గానికి పనులు చేయిస్తున్నానని తెలిపారు.ఎమ్మెల్యే, ఎంపీ కలిసి పనిచేస్తే ఒక ప్రాంతం ఎంత అద్భుతంగా అభివృద్ధి చెందుతుందో చెప్పడానికి మంగళగిరి ఒక ఉదాహరణ అని లోకేశ్ అన్నారు. ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి పనిచేస్తూ లక్ష్మీ నరసింహ స్వామి గుడి అభివృద్ధికి, భూగర్భ డ్రైనేజీ వంటి పనులకు కేంద్రం నుంచి నిధులు సాధిస్తున్నామని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా, సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల బండిలా ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు. రాయల్ ఎన్‌ఫీల్డ్, గూగుల్, అదానీ అంకా వంటి పెద్ద కంపెనీలు ఏపీ వైపు చూస్తున్నాయని, రాబోయే మూడేళ్లలో యువత ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. తనను గెలిపించిన ప్రజల కోసం అహర్నిశలు కష్టపడతానని, వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుతూ లోకేష్ తన ప్రసంగాన్ని ముగించారు.

# ఆలమూరు లాకులను ఆధునీకరించాలి

**మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి విజ్ఞప్తి చేసిన ఆలమూరు నాయకులు**

**ఆలమూరు, పెన్ పవర్, జూలై 17;**శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలమూరు లాకుల వద్ద శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలను పునర్ నిర్మించి లాకుల వ్యవస్థ ఆధునికీకరణ పనులు చేపట్టాలని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును ఆలమూరు నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం లొల్లలాకుల వద్ద జరిగిన కార్యక్రమంలో వారు మంత్రిని కలిసి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సమక్షంలో ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలమూరు సొసైటీ చైర్మన్ వంటిపల్లి సతీష్, ఈదల నల్ల బాబు, ఆలమూరు నీటి సంఘం అధ్యక్షులు వైట్ల గంగరాజు, రామానుజుల శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# డెల్టా దాహం తీర్చేందుకు కూటమి కసరత్తు

**శివారు భూములకు సైతం సాగునీరు అందించడమే లక్ష్యం**

**లొల్ల లాకుల వరకు మోటార్‌సైకిల్‌పై పర్యటించిన మంత్రి నిమ్మల**







**ఆత్రేయపురం, పెన్ పవర్ జూలై 17:**గోదావరి డెల్టాలో చివరి ఆయకట్టు భూముల వరకు సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో గోదావరిలో నీటి లభ్యత గణనీయంగా తగ్గినప్పటికీ, సమర్థవంతమైన నీటి యాజమాన్యంతో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందన్నారు.

సెంట్రల్ డెల్టా వాటర్ మేనేజ్‌మెంట్ పర్యవేక్షణలో భాగంగా మంత్రి నిమ్మల రామానాయుడు, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి బొబ్బర్లంక నుంచి లొల్ల లాకుల వరకు మోటార్‌సైకిల్‌పై పర్యటించి కాలువలు, లాకులు, నీటి ప్రవాహాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం లొల్ల లాకుల వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు.మంత్రి నిమ్మల మాట్లాడుతూ, గత 70 ఏళ్లలో జూలై నెలలో గోదావరిలో కేవలం 15 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం నమోదవడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. పరిస్థితిని ఎదుర్కొనేందుకు సీలేరు నుంచి 5 వేల క్యూసెక్కుల నీటిని గోదావరి డెల్టాకు మళ్లిస్తున్నామని తెలిపారు. నీటి వృథాను అరికట్టి, అవసరమైన చోట్లే సరఫరా జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు.కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో నీటిపారుదల వ్యవస్థ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పనిచేస్తోందన్నారు.ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ, గోదావరి డెల్టా ఆధునీకరణతో పాటు లొల్ల లాకుల పునర్నిర్మాణం, ధవళేశ్వరం బ్యారేజీ మరమ్మత్తుల ద్వారా డెల్టాకు మళ్లీ జలకళ తీసుకురావాలని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కార చర్యలు చేపట్టడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. కాలువల నిర్వహణ, లాకుల పునరుద్ధరణ, సమర్థవంతమైన నీటి పంపిణీ ద్వారా శివారు భూములకు కూడా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమం కొత్తపేట జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్,అనపర్తి నియోజకవర్గం పరిశీలికులు ఆకుల రామకృష్ణ డెల్టా ప్రాజెక్ట్ అధ్యక్షులు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు, కరుటూరి నరసింహారావు, ఆత్రేయపురం మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు,వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు,మండల నాయకులు రైతులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




### త్రాగునీరు ఆదా చేయాలని ప్రచారం..

### పంచాయతీ ఆవరణలోనే నీటి వృథా..

# ప్రశ్నిస్తున్న గ్రామస్థులు

- గ్రామాల్లో నీటి సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు.. తమ కార్యాలయ ఆవరణలోనే వృథాగా పారుతున్న త్రాగునీటిని అరికట్టలేకపోతున్నారు. గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామపంచాయతీలో నెలకొన్న ఈ పరిస్థితి అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- పంచాయతీ ఆవరణలోనే వృథా అవుతున్న త్రాగునీరు
- చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు
- నీటి సంరక్షణపై అవగాహన.. ఆచరణలో నిర్లక్ష్యం
- 'కంచే చేను మేస్తే' అన్నట్లు అధికారుల తీరు
- వేసవిలో నీటి సమస్య..
- ఇప్పుడే అప్రమత్తం కావాలి
- వెంటనే మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థుల డిమాండ్
- అయ్యో పాపం.. వృథా అవుతున్న త్రాగునీరు





**పెన్ పవర్ ప్రతినిధి । గండేపల్లి, జూలై, 17**

ప్రతి నీటి బొట్టు విలువైనదని ప్రభుత్వం, గ్రామపంచాయతీలు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా.. అదే అధికారులు తమ కార్యాలయ ఆవరణలో వృథాగా పారుతున్న త్రాగునీటిని అరికట్టలేకపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో త్రాగునీటి కుళాయి నిరంతరం లీక్ అవుతూ నీరు వృథాగా పారుతోంది. ఈ దృశ్యం ప్రతిరోజూ అక్కడికి వచ్చే ప్రజలకు కనిపిస్తున్నప్పటికీ, దాన్ని సరిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

గ్రామాల్లో త్రాగునీటిని పొదుపుగా వినియోగించాలని దండోరాలు వేయిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న అధికారులు.. తమ కార్యాలయంలోనే జరుగుతున్న నీటి వృథాను పట్టించుకోకపోవడం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. చిన్నపాటి మరమ్మత్తుతో పరిష్కరించగల సమస్యను నిర్లక్ష్యం చేయడం వల్ల రోజూ విలువైన త్రాగునీరు వృథా అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'కంచే చేను మేస్తే' అన్న సామెతను తలపించేలా అధికారుల వ్యవహారం ఉందని గ్రామస్థులు మండిపడుతున్నారు. ప్రజలకు నీటి సంరక్షణపై సూచనలు చేసే అధికారులు ముందుగా తమ కార్యాలయాల్లోనే ఆదర్శంగా ఉండాలని వారు సూచిస్తున్నారు. గ్రామంలో కొన్ని సందర్భాల్లో త్రాగునీటి కొరత ఏర్పడుతున్నప్పుడు ఇలాంటి నిర్లక్ష్యం మరింత బాధాకరమని పేర్కొంటున్నారు.


నీటి వనరులు రోజురోజుకూ తగ్గుతున్న నేపథ్యంలో ప్రతి బొట్టు నీటిని కాపాడాల్సిన అవసరం ఉందని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. చిన్న లీకేజీలను సకాలంలో అరికట్టడం ద్వారా వేల లీటర్ల నీటిని ఆదా చేయవచ్చని చెబుతున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లీకేజీని వెంటనే మరమ్మతు చేసి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రజలకు నీటి సంరక్షణపై సందేశాలు ఇవ్వడమే కాకుండా, వాటిని ఆచరణలో కూడా చూపించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.


# ఎన్‌టీఆర్ వైద్య సేవల్లో నగదు వసూళ్లు చేస్తే కఠిన చర్యలు

**కలెక్టర్ హరీంద్ర ప్రసాద్**

**కాకినాడ, జూలై 17 ,పెన్ పవర్:** ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో డా. ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకాన్ని పటిష్టంగా అమలు చేసి అర్హులైన రోగులకు పూర్తిస్థాయిలో నగదు రహిత వైద్యం అందించాలని, నిబంధనలు ఉల్లంఘించిన ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరీంద్ర ప్రసాద్ హెచ్చరించారు.శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన డా. ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా క్రమశిక్షణ కమిటీ సమావేశంలో ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. పథకం కింద చికిత్సకు వచ్చిన రోగులను ఏ ఆసుపత్రి కూడా తిరస్కరించరాదని, చికిత్స నిరాకరించినా లేదా నగదు వసూలు చేసినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అలాంటి ఫిర్యాదులు వచ్చిన వెంటనే నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఫీల్డ్ సిబ్బందిని ఆదేశించారు.



డా.ఎన్‌టీఆర్ వైద్య సేవ లబ్ధిదారుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా నగదు వసూలు చేసినందుకు ఐదు ఆసుపత్రులకు మొత్తం రూ.3,13,970 జరిమానా విధించినట్లు కలెక్టర్ వెల్లడించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.కె.అనిత, డీసీహెచ్ఎస్ డా.కె.మహేశ్వరరావు, డా.ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డా.పి.రాధాకృష్ణ, జిల్లా మేనేజర్ కె.నవీన్‌తో పాటు ఆరోగ్యశ్రీ సిబ్బంది పాల్గొన్నారు.




## ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పరామర్శించిన ఎమ్మెల్యే శ్రీ గిడ్డి సత్యనారాయణ



**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 17:**కుడి భుజానికి శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ను హైదరాబాదులోని ఆయన నివాసంలో శుక్రవారం సాయంత్రం పి. గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ మర్యాద పూర్వకంగా పరామర్శించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజాసేవలో మరింత ఉత్సాహంగా పాల్గొనాలని ఆకాంక్షించారు. అలాగే వైద్యుల సూచనలను పూర్తిగా పాటిస్తూ తగిన విశ్రాంతి తీసుకోవాలని కోరుతూ, ఆయన త్వరితగతిన కోలుకోవాలని మనస్ఫూర్తిగా అభిలషించారు.

# రూ.14.14 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి సుభాష్ శ్రీకారం





**రామచంద్రపురం, జూలై 17 పెన్ పవర్:** రామచంద్రపురం పట్టణ సమగ్ర అభివృద్ధికి మరో ముందడుగు పడింది. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్.రాజు,జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఈఈ హుస్సేన్, డీఈ శ్రీకాంత్, కూటమి నాయకులతో కలిసి రూ.14.14 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఆరు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,అమృత్ 2.0 పథకం కింద రూ.13.40 కోట్లతో 2.50 లక్షల లీటర్ల సామర్థ్యం గల తాగునీటి పథకానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు.అలాగే 4వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణం, అరుంధతి నగర్--రాజబాబు నగర్ పార్కులో చిన్నారుల ఆట పరికరాల ఏర్పాటు, 2వ వార్డులో కనకదుర్గమ్మ ఆలయం నుంచి కొత్తూరు రోడ్డు వరకు సీసీ రోడ్డు, 28వ వార్డులో సీసీ డ్రెయిన్ నిర్మాణం, 20వ వార్డులో కేఎస్ఆర్ నగర్ పార్కుకు కాంపౌండ్ వాల్ నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. రామచంద్రపురం పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత రెండేళ్లలో పట్టణంలో సుమారు రూ.50 కోట్లతో రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు,పార్కుల అభివృద్ధి,విద్యుత్ సౌకర్యాల మెరుగుదల వంటి పలు అభివృద్ధి పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. అమృత్ 2.0 కింద చేపట్టిన తాగునీటి ప్రాజెక్టు పూర్తయిన అనంతరం పట్టణ ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందుబాటులోకి వస్తుందని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. రామచంద్రపురాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు మరిన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఉండవెల్లి శివ,మున్సిపల్ అధికారులు,కూటమి పార్టీ నాయకులు, వార్డు ప్రతినిధులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఆదిత్య యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ధనిశెట్టి భద్రరావు కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ



**గండేపల్లి,పెన్ పవర్,జులై,17:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ భౌతిక శాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న" ధనిశెట్టి భద్ర రావు" ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుంటూరు నుంచి డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో. ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుంటూరు కి చెందిన ప్రొఫెసర్ జి. నాగరాజు నేతృత్వంలో ధనిశెట్టి భద్ర రావు సమర్పించిన "థీసిస్ శీర్షిక: "డైఎలెక్ట్రిక్ డిస్పర్షన్ అండ్ డైపోలార్ రిలాక్సేషన్ డైనమిక్స్ ఇన్ రెడ్–లెడ్ మోడిఫైడ్ బిస్మత్ బోరేట్ గ్లాస్–సిరామిక్స్ కంటైనింగ్ కాపర్ అండ్ సిల్వర్ అయాన్స్" అనే అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. "డా." ధనిశెట్టి భద్ర రావు " భవిష్యత్ లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆదిత్య అధినేత, యూనివర్సిటీ ఛాన్సలర్ డా. ఎన్. శేషారెడ్డి, శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ . డా.ఎం.శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్. ప్రో. ఎం.బి. శ్రీనివాస్. ప్రో. వైస్ ఛాన్సలర్. డా. ఎస్. రమాశ్రీ, డా. ఆదిరెడ్డి రమేష్, డా. రవి తంగజన్, రిజిస్ట్రార్ డా జి.సురేష్, అసోసియేట్ డీన్ . డా. ఏ.వానతి మరియు వివిధ విభాగాల విభాగాధిపతులు ఉపాధ్యాయ సిబ్బంది డా.ధనిశెట్టి భద్ర రావు కు అభినందనలు తెలియజేశారు.

## అడ్డుకొండ భూమి పేద ప్రజలకే దక్కాలి


కర్నాకుల డిమాండ్.




**గండేపల్లి, పెన్ పవర్,జులై,17:** మల్లిసాల–కె.గోపాలపురం మధ్యలో ఉన్న 580 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు అయిన అడ్డుకొండ భూమి పేద ప్రజలకు దక్కాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నాడు కాకినాడ జిల్లా గండేపల్లి మండలం కే గోపాలపురం గ్రామంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ణాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ఈ భూమిపై ఆధారపడి రెండు గ్రామాల ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసి పేదలు ఆధారపడి ఉన్నారని,ఈ భూమి కోసం అనేక దాడులు, కేసులు, నిర్బంధాలు అనుభవించారని ఆయన తెలిపారు.ఈ భూమిపై రెండు గ్రామాల ప్రజలకు హక్కు కల్పిస్తే వారి కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని ఆయన తెలిపారు. గత 25 సంవత్సరాల కాలం నుంచి పోరాడుతున్న ప్రజలకు ఈ భూమి పై హక్కు కల్పించి, పట్టాలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు,

ప్రభుత్వ పోరంబోకైన అడ్డుకొండ భూమి రెండు గ్రామాల ప్రజలకు దక్కేవరకు మా ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో అలుపెరగని పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహాయ కార్యదర్శి కే. సతీష్, జిల్లా నాయకులు కే. రామలింగేశ్వరరావు,జాన్,గ్రామ నాయకులు పోచమ్మ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## తలుపులమ్మకు చీర సారెలు సమర్పించిన యనమల దివ్య



**పెన్ పవర్ ప్రతినిధి (తుని)**తలుపులమ్మ అమ్మవారికి ప్రభుత్వ విప్ యనమల దివ్య శుక్రవారం చీర సారెలు సమర్పించారు ఆషాడ మాస ఉత్సవాల సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే దివ్య కు అధికారులు అభివృద్ధి కమిటీ సభ్యులు ఆలయ లాంచనాలతో స్వాగతం పలికారు అర్చకులు వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి వేదాశీర్వచనం అందజేశారు అధికారులు అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి అమ్మవారి శేషసస్త్రాన్ని ఎమ్మెల్యేకి అందజేశారు అనంతరం ఎమ్మెల్యే దివ్య అమ్మవారికి జరిపించిన కుంకుమ పూజలో శ్రీ ప్రకాష్ లయోలా శ్రీవిద్య భాష్యం శాంతినికేతన్ అచ్యుత మదర్ విద్యా సంస్థలకు చెందిన 1008 మంది విద్యార్థినులతో కలసి సువాసినీ పూజలో పాల్గొన్నారు భక్తిశ్రద్ధలతో పూజలు చేసారు తీర్థప్రసాదాలను స్వీకరించారు తెలుగుదేశం పార్టీ నాయకులు యనమల రాజేష్ చింతంనీడి అబ్బాయి కార్యనిర్వహణాధికారి పెన్మత్స విశ్వనాథరాజు ధర్మకర్తల మండల అధ్యక్షుడు పెంటకోట భాస్కర సత్యనారాయణ దూలం మాణిక్యం పరవాడ తాతబాబు అరిగెల నరసింహమూర్తి చిటికల శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# సేంద్రియ ఎరువుల వాడకంతో భూసార పరిరక్షణ కలుగుతుంది





**రైతుల శిక్షణా కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు**

**గండేపల్లి, పెన్ పవర్, జూలై, 17:**ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయ సాగుతో భూసార పరిరక్షణ చేయవచ్చునని రైతుల శిక్షణా కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక అగ్రికల్చర్ అధికారిని జే లక్ష్మి ఆధ్వర్యంలో ఆత్మ బ్లాక్ పరిధిలోని గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయం మరియు భూసార పరిరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో "శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ప్రకృతి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత, రసాయన ఎరువులు మరియు పురుగుమందుల వినియోగాన్ని తగ్గించడం, భూసారాన్ని కాపాడే పద్ధతులు, తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందే సాంకేతికతలపైమరియు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా పంటలకు పంట బీమా నమోదు అవశ్యకతను వివరంగా అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో పాల్గొన్న రైతులు అధికారులు వివరించిన అంశాలపై ఆసక్తి కనబరిచి, తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా రైతులు ఆధునిక మరియు స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించి మంచి దిగుబడులు సాధించాలని అధికారులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఏడిఏ, జి. శ్రీనివాస్గారు, డిఆర్సి ఏవో – డి.సంజయ్ , డాట్ సెంటర్ శాస్త్రవేత్త శర్మ ,మండల వ్యవసాయ అధికారిణి జె . లక్ష్మి , వ్యవసాయ విస్తరణ అధికారి.బలరామకృష్ణ, గ్రామ వ్యవసాయ/ఉద్యాన సహాయకులు లావణ్య, జ్యోత్స్న, ప్రియాంక, ఎఫ్ పి ఓ , కుమార స్వామి,గ్రామ రైతులు పాల్గొన్నారు

## స్వర్గీయ మాజీ మంత్రి ముద్రగడకు ముస్లిం సోదరులు ఘన నివాళులు.

-ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు.






**కిర్లంపూడి,పెన్ పవర్, జూలై, 17:** మాజీ మంత్రి,కాపు ఉద్యమ నేత స్వర్గీయ ముద్రగడ పద్మనాభం నివాసానికి కిర్లంపూడి మండలంలోని ముస్లిం సోదరులు భారీగా సంఖ్యలో తరలివచ్చి ముద్రగడ ఇంటి ఆవరణలో ఉన్న ఆయన సమాధి వద్ద పూలమాలలు ఉంచి ఘన నివాళులర్పించడమే కాకుండా, ముద్రగడ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కుల,మతాలకు అతీతంగా ప్రజల అభిమానాన్ని చూరగొన్న ముద్రగడ పద్మనాభం సేవలను ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు.అనంతరం ఆయన కుమారులు ముద్రగడ వీర రాఘవరావు (బాలు), ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ ప్రెసిడెంట్ మహమ్మద్ షాబుద్దీన్,ముస్లిం పెద్దలు మహమ్మద్ ఖయ్యూం భాషా,షేక్ ఇబ్రహీం(ఐ జి), షేక్ కాలేషా,పలువురు కమిటీ సభ్యులతో పాటు అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## పంటల బీమాకు రైతులు నమోదు చేసుకోవాలి-ఏవో జె.లక్ష్మి

– ఖరీఫ్ 2026కు పీఎంఎఫ్బీవై అమలు.. వరికి రూ.760, ప్రత్తికి రూ.2000 ప్రీమియం




**గండేపల్లి , పెన్ పవర్, జూలై, 17:**రైతుల కోసం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్ బీవై) ఖరీఫ్/ సార్వా 2026 పంటల బీమా పథకం అమలు చేస్తున్నట్లు గండేపల్లి వ్యవసాయ అధికారిణి జె.లక్ష్మి తెలిపారు. బ్యాంకుల్లో పంట రుణాలు పొందిన రైతులు బ్యాంకర్ల మినహాయింపుతో ప్రీమియం ద్వారా నమోదు పొందని చేసుకోవచ్చని, రుణాలు రైతులు సీఎస్సీ, మీ సేవ కేంద్రాల ద్వారా ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పంటల బీమా నమోదు కోసం రైతులు సాగు చేస్తున్న పంట, విత్తిన విస్తీర్ణానికి సంబంధించిన స్వీయ ధృవీకరణ పత్రాన్ని తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. అలాగే ఈ–పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఖరీఫ్ 2026 సీజన్లో పీఎంఎఫ్ బీవై కింద దిగుబడి ఆధారిత పంటగా వరి, వాతావరణ ఆధారిత పంట బీమా పథకం కింద ప్రత్తి పంటలకు బీమా వర్తిస్తుందని వివరించారు.కాకినాడ జిల్లాలో వరి పంటకు ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ, ప్రత్తి పంటకు ఇఫ్కో టోకియో కంపెనీలు బీమా సంస్థలుగా ఎంపికయ్యాయని తెలిపారు. వరి పంటకు ఎకరానికి రూ.760 ప్రీమియం కాగా, నమోదు గడువు ఆగస్టు 15 వరకు ఉందన్నారు. ప్రత్తి పంటకు ఎకరానికి నమోదు రూ. 2000 ప్రీమియంగా నిర్ణయించగా, జూలై 24లోపు చేసుకోవాలని కోరారు. రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని పంటల బీమా నమోదు చేసుకోవాలని ఏవో జె.లక్ష్మి విజ్ఞప్తి చెసారు

## జగ్గంపేటలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 17:** జగ్గంపేట మండలం రాజపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిదిలోని జగ్గంపేటలో శుక్రవారం డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలలో బాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న దోమ – పెద్ద ముప్పు, డెంగ్యూ వ్యాధి నివారణ – మనందరి బాధ్యత, ఆరోగ్యమే – మహాభాగ్యం అంటూ నినాదాలతో మానవహారం నిర్వహించారు. అనంతరం రాజపూడి పీహెచ్సీ వైద్యాధికారి పూజ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి వ్యాప్తి, నివారణ గురించి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఎంపీడీవో చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి శివ, పెద్దాపురం ఎస్ యుఓ సత్యనారాయణ, రాజపూడి పిహెచ్సి ఎంపీహెచ్ఈఓ ఉమా మహేశ్వరరావు, సూపర్వైజర్ శంకర్, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొని డెంగ్యూ వ్యాధి వ్యాప్తి, తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు.

## షైనింగ్ స్టార్ అవార్డుల్లో నవోదయ విద్యార్థుల ప్రతిభ






**ముగ్గురికి రాష్ట్ర స్థాయి గుర్తింపు**

**కాజులూరు, పెన్ పవర్ జూలై 17:** 2025--26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డులకు గొల్లపాలెం నవోదయ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని కరస్పాండెంట్ డి.వి.వి.ఎస్.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ,పదో తరగతి వార్షిక పరీక్షల్లో మండలంలో అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులకు విద్యాశాఖ షైనింగ్ స్టార్ అవార్డులను ప్రకటించిందన్నారు. ఇందులో తమ పాఠశాలకు చెందిన గొల్లపల్లి గంగావర్షిత 583/600 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం, డి.వి.వి.ఎస్.ధరణి ప్రణీత 574/600 మార్కులతో ద్వితీయ స్థానం,ఎస్. జాస్మిన్ దేశ్ 571/600 మార్కులతో మండలంలో నాలుగో స్థానం సాధించి షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపికయ్యారని వెల్లడించారు.ఈ సందర్భంగా అవార్డులకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు,సహ విద్యార్థులు ఘనంగా అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# మాజీ మంత్రి ముద్రగడ గొప్ప అభ్యుదయ భావాలు గల రాజకీయవేత్త.





- మాజీ మంత్రి ముద్రగడ మృతి అన్ని వర్గాలకు తీరని లోటు.
- మాజీ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్.

**కిర్లంపూడి,పెన్ పవర్, జూలై 17:** స్వర్గీయ మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం గొప్ప అభ్యుదయ భావాల కలిగిన వ్యక్తి అని, అటువంటి వ్యక్తి మృతి చెందడం రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు తీరని లోటని మాజీ ఐపిఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ అన్నారు. దివంగత మాజీ మంత్రి,కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం కుటుంబ సభ్యులను మాజీ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్,కాపు నాయకులు మారిశెట్టి రాఘవయ్య పరామర్శించారు.ముందుగా ముద్రగడ సమాధి వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి,ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.అనంతరం ముద్రగడ కుమారులు ముద్రగడ వీర రాఘవరావు(బాలు) ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబులను పరామర్శించి తమ తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని,సానుభూతిని తెలియజేసారు.ఈ సందర్భంగా పీవీ సునీల్ కుమార్ మాట్లాడుతూ ముద్రగడ ఒక సామాజిక వర్గానికి మాత్రమే పరిమితమైన నాయకుడు కాదని,ఉన్నతమైన అభ్యుదయ భావాలు కలిగిన గొప్ప ప్రజానేత అని పేర్కొన్నారు.కాపులు,దళితుల మధ్య సఖ్యతకు ముద్రగడ కృషి చేశారని అన్నారు.దళితుల పట్ల ముద్రగడకు ఎంతో ప్రేమ,అభిమానం ఉండేదన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అంటే ఆయనకు అపారమైన గౌరవమని,అందుకే కిర్లంపూడిలోని కాపుల రామాలయం సమీపంలో నిలువెత్తు అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయించారని గుర్తు చేశారు.జనరల్ కేటగిరీలో ఎస్సీ, బిసి సామాజిక వర్గాలకు పదవులు కల్పించిన ఘనత ముద్రగడ దక్కుతుందన్నారు.దళితులు,కాపులు కలిసి ముందుకు సాగితే కాపు ముఖ్యమంత్రి కావడం సాధ్యమన్నారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఇండియన్ మిషన్ కాకినాడ జిల్లా కన్వీనర్ గునపర్తి అపురూప్,కాకినాడ జిల్లా మహిళా అధ్యక్షురాలు కొంకిపూడి రాజ్యలక్ష్మి,బీర గాంధీ,కొంగు రమేష్, చిందాడ రమణ,బీరా రామకృష్ణ,బర్రె సింహాచలం,బత్తిన తాతాజీ,ముఖే నానిబాబు,తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ కార్యకర్తకు రూ.30 వేల ఆర్థిక సాయం అందజేసిన మంత్రి సుభాష్



**రామచంద్రపురం, జూలై 17 పెన్ పవర్:** పార్టీ కోసం నిస్వార్థంగా శ్రమించిన ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో అంకితభావంతో పనిచేస్తూ, పార్టీ ప్రచార రథాన్ని నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్న సీనియర్ కార్యకర్త చెల్లుబోయిన వీర వెంకట సత్యనారాయణకు మంత్రి తన వ్యక్తిగత సహాయంగా రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,రామచంద్రపురం గుబ్బలవారిపేటకు చెందిన వీర వెంకట సత్యనారాయణ రిక్షాపై పార్టీ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎన్నో ఏళ్లుగా తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి విశేష సేవలందించారని కొనియాడారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను గుర్తించడం,వారి వెన్నంటే నిలవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. కష్టకాలంలో కార్యకర్తలకు అండగా నిలవడం పార్టీ సంస్కృతికి నిదర్శనమని మంత్రి అన్నారు.ఆర్థిక సహాయం అందుకున్న చెల్లుబోయిన వీర వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ, తన సేవలను గుర్తించి చేయూత అందించిన మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తల సంక్షేమం పట్ల మంత్రి చూపుతున్న శ్రద్ధను ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉండవెల్లి శివ,దంగేటి గౌరీశంకర్, ఆలయ చైర్మన్ వీరభద్రరావు,గుబ్బల వెంకటరమణ,దొమ్మలపాటి విజయలక్ష్మి,తాయారు,కూటమి పార్టీల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.


# రెండు షైనింగ్ స్టార్స్ అవార్డులు సాధించిన స్వర్ణ భారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు





**తాళ్ళపూడి, పెన్ పవర్, జూలై 17:**ధర్మవరంలోని స్వర్ణభారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో 2026 పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో పోలిశెట్టి వర్షాంజలి 600 లకు 596 మార్కులు, బెల్లపుకొండ నయన వెంకట సత్య శ్రీ 600 లకు 593 మార్కులు సాధించారు. కొవ్వూరు నియోజకవర్గంలో అత్యధిక మార్కులు సాధించిన ఈ విద్యార్థులు ప్రభుత్వం నుండి షైనింగ్ స్టార్ ప్రతిభ అవార్డులకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం, కరస్పాండెంట్ పేరిచర్ల రామకృష్ణ రాజు, ప్రిన్సిపాల్ పేరిచర్ల పద్మ, స్కూల్ ఇన్ చార్జెస్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. కొవ్వూరు మండలంలోని అత్యధిక ప్రతిభ కనబరచిన విద్యార్థులలో తమ విద్యార్థులు ఈ అవార్డుకు ఎంపికైనందుకు తల్లిదండ్రులు స్కూల్ యాజమాన్యానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# మండలం లో విద్యార్థులకు "మెరిసే నక్షత్రాల" నగదు పురస్కారాలు...



**శంఖవరం పెన్ పవర్ జులై 17:**-ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో అత్యధిక ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మెరిసే నక్షత్రాలు (షైనింగ్ స్టార్స్) గా ప్రభుత్వం గుర్తిస్తోంది. వారికి ఒక్కొక్కరికీ రూ. 20,000 లు నగదు పురస్కారాలను, ప్రశంసా పత్రాలనూ రాష్ట్ర విద్యాశాఖ అందిస్తోంది. ఈ అరుదైన ప్రోత్సాహక, ప్రశంసా పూర్వక బహుమానాలకు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం నుంచి అత్యధికంగా ఎనిమిది మంది మెరిసే నక్షత్రాలుగా ఎంపిక అయ్యారు. వీరిలో శంఖవరం ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల (ఏ.పి. మోడల్ స్కూల్) నుంచి సాయిపిరెడ్డి స్వాతి (594 మార్కులు), కత్తిపూడి మాధురి విద్యాలయం నుంచి బావిశెట్టి రాజరాజేశ్వర (592), కొయ్యా మోహన నాగ దుర్గ (586), మచ్చా ప్రైజీ (575), అన్నవరం శ్రీ సత్యసాయి విద్యా విహార్ నుంచి గవ్వా రేణుక (592), రోమాల యామిని (583), అన్నవరం శ్రీ శారదా ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాల నుంచి మచ్చా గణసాయి కిషోర్ (586), మండపం జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాల నుంచి చాగంటి నాగవేణి (550) ఎంపిక అయ్యారు. వీరికి కాకినాడలో సోమవారం ఉదయం నిర్వహించే అభినందన సభలో రాష్ట్ర ప్రభుత్వం తరపున జిల్లా మంత్రి, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఈ ప్రోత్సాహక బహుమతులను బహూకరిస్తారు. ఈ మెరిసే నక్షత్రాలను పలువురు ప్రముఖులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్దలు, అధికారులు, ఉపాధ్యాయులు అందరూ అభినందిస్తున్నారని మండల విద్యాశాఖ అధికారి సూరిశెట్టి వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో మీడియాకు వెల్లడించారు.

# కొత్త సీఐ జి. రమేష్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసిన ప్రజా ప్రతినిధులు




**రావులపాలెం పెన్ పవర్ జూలై 17:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జి. రమేష్‌బాబును పలువురు సామాజిక సేవా సంస్థల ప్రతినిధులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్--బాబు జగజీవన్‌రామ్ యునైటెడ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పలివెల రాజు, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఎంప్లాయిస్ సెల్ చైర్మన్ డాక్టర్ యార్లగడ్డ సురేష్‌కుమార్, జిల్లా ఎంప్లాయిస్ సెల్ చైర్మన్ కొల్లి వెంకటేశ్వర్లు, మీడియా అండ్ పబ్లిక్ రిలేషన్స్ సెల్ జిల్లా చైర్మన్ విజయబాబు తదితరులు సీఐకి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా రావులపాలెంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించాలని ప్రతినిధులు కోరారు.

సీఐ జి. రమేష్‌బాబు మాట్లాడుతూ, ప్రజల సహకారంతోనే సమర్థవంతమైన పోలీసింగ్ సాధ్యమవుతుందని, చట్టాన్ని అందరికీ సమానంగా అమలు చేస్తూ ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కట్టుబడి ఉంటామని తెలిపారు. పోలీసు శాఖతో సామాజిక సంస్థలు సమన్వయంతో పనిచేసి ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు సహకరించాలని ఆయన కోరారు.



# జగ్గంపేట అన్నా క్యాంటీన్లో అన్నదానం



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 17:** జగ్గంపేట ఆర్యవైశ్య ప్రముఖులు, జగ్గంపేట మాజీ ఉపసర్పంచ్ స్వర్గీయ నాళం వెంకట సత్యనారాయణ జ్ఞాపకార్థం శుక్రవారం జగ్గంపేట గోకవరం రోడ్డులోని ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ లో ఆయన కుమారుడు నాళం గోపి ఆర్థిక సహాయంతో అన్నదానం నిర్వహించారు. ఉదయం 300 మందికి వేడి వేడి టిఫిన్, మధ్యాహ్నం 500 మందికి నాళం గోపి తన కుమార్తె, కుమారుడు, బాబాయ్ నాళం సూరిబాబుతో కలిసి ఒక్కొక్కరికీ ప్రేమతో వడ్డించారు.

# కూటమి ప్రభుత్వంలో అభివృద్ధికి అగ్ర ప్రాధాన్యత

- ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 17 :** కూటమి ప్రభుత్వంలో అభివృద్ధికి అగ్ర ప్రాధాన్యత ఇస్తున్నట్లు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట రావులమ్మ నగర్ లోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులను అందుకున్నారు. కిర్లంపూడి మండలం శృంగరాయునిపాలెం, ఎస్.తిమ్మాపురం గ్రామ ప్రజలు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకి వినతిపత్రం అందజేశారు. ఎన్నారై రాజు బొజ్జపు ఆధ్వర్యంలో కిర్లంపూడి మండలం, శృంగరాయునిపాలెం, కృష్ణవరం గ్రామాల మధ్య గల ఏరు కాలువపై వంతెన నిర్మించాలని వందలాది మంది మహిళలు ప్రజలు ఎమ్మెల్యే ను కోరారు.

ఈ కార్యక్రమంలో అడపా భరత్, రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, ఎస్వీఎస్ అప్పలరాజు, శృంగరాయుని పాలెం, ఎస్ తిమ్మాపురం గ్రామాల ప్రజలు నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజలు హాజరయ్యారు.

# రావులపాలెం హత్య కేసులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం నమోదు

**నిందితుడిని రిమాండ్‌కు పంపిన పోలీసులు.. తదుపరి దర్యాప్తు కొత్తపేట డీఎస్పీకి బదిలీ**



**పెన్ పవర్ రావులపాలెం, జూలై 17:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ 168/2026 హత్య కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 103(1) కింద నమోదైన ఈ కేసులో నిందితుడు నూకల దుర్గాప్రసాద్‌ను పోలీసులు అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు రిమాండ్‌కు పంపినట్లు రావులపాలెం టౌన్ ఇన్‌స్పెక్టర్ జి. రమేష్‌బాబు తెలిపారు. దర్యాప్తులో భాగంగా నిందితుడి కుల ధ్రువీకరణ పత్రాన్ని రావులపాలెం తహసీల్దార్ కార్యాలయం నుంచి సేకరించి పరిశీలించగా, నిందితుడు ఇతర కులానికి చెందినవాడని, మృతుడు షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తి అని నిర్ధారణ అయినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో కేసులో ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టంలోని సంబంధిత నిబంధనలను చేర్చి (ఆల్టర్ చేసి) కేసును మరింత లోతుగా దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం ప్రకారం నమోదైన కేసుల దర్యాప్తును డీఎస్పీ స్థాయి అధికారి నిర్వహించాల్సి ఉండటంతో, తదుపరి విచారణను కొత్తపేట డీఎస్పీకి బదిలీ చేసినట్లు టౌన్ ఇన్‌స్పెక్టర్ జి. రమేష్‌బాబు వెల్లడించారు. కేసుకు సంబంధించిన అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని, పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని పోలీసులు పేర్కొన్నారు.

## భూసార పరీక్షలు ఆధారంగా ఎరువులు వినియోగించుకోవాలి-ఆత్మ బిటిఎం బాబురావు



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పెన్ పవర్, జూలై 17:** భూసార పరీక్షలు ఆధారంగా రైతులు ఎరువులు వినియోగించుకోవాలని ఆత్మ బిటిఎం బాబురావు తెలిపారు.మండల కేంద్రమైన ప్రత్తిపాడులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ వారి సౌజన్యంతో రైతులకు 2 రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు సాయిల్ హెల్త్ కార్డ్స్ ప్రకారం సూచించిన ఎరువులులను రైతులు తమ పొలంలో వాడుకోవాలని,ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండించాలని, రసాయనిక ఎరువులు వాడడం వలన కలిగే అనర్థాలను రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో ఆత్మ బిటిఎం బాబురావు వ్యవసాయం లో జీవన ఎరువుల వాడకం ఉపయోగాలు, ఆయిల్ పామ్ లో రైనోసిరస్ బీటిల్ కంట్రోల్ చెయ్యడానికి వాడే బకెట్ టాప్స్ గురించి వివరించారు.హార్టికల్చర్ డిపార్ట్మెంట్ వారు ఆయిల్ పామ్ లో ఇంటర్ క్రాప్ వెయ్యడం వలన ఇంటర్ క్రాప్ కి అదనం గా క్రాప్ మెయింటినెన్స్ ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవయ అధికారిణి జోకా అమృత, హార్టికల్చర్ ఆఫీసర్ దివ్యశ్రీ,ప్రకృతి వ్యవసాయ అధికారి నికిల్ వర్మ , ఆత్మ మెంబర్ సత్యనారాయణ,వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## రైతులు ఆరుతడి పంటలను ఎంచుకోవాలి


జగ్గంపేట ఏడిఏ శ్రీనివాస్



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 17:** వర్షాభావ పరిస్థితులు, ఎలినినో ప్రభావం దృష్ట్యా రైతులు ఆరుతడి పంటలను ఎంచుకోవాలని జగ్గంపేట ఏడిఏ జి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జగ్గంపేట మహిళా మండలి కార్యాలయంలో ఏడిఏ శ్రీనివాస్ అధ్యక్షతన మండలంలో ఉన్న వివిధ గ్రామాల్లో రైతులకు రెండు రోజులు శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. అందులో భాగంగా ఆత్మ వారి సౌజన్యంతో ఆరుతడి పంటలకు వెళ్లాలని, వర్షపాతం ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా ఉండటంతో చిరుధాన్యాలు అనగా రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు వంటి పంటలు ఎంచుకోవాలని రైతులకు సూచించారు. అంతేగాక ఫెర్టిలైజర్ యాప్ ద్వారా ఇస్తున్నటువంటి యూరియా ఆ పంటకు తగినంత మోతాదుతో నిర్దేశించబడిన యూరియా అని రైతులకు వివరించారు. అధికంగా యూరియా వాడడం వల్ల పురుగులు మరియు తెగుళ్ల ఆశించడానికి అవకాశం ఉందని మీరు తగినంత మోతాదులో యూరియా వాడినట్లయితే మనం పిచికారి చేసే మందులను తగ్గించుకోవడానికి ఆస్కారం ఉంటుందని రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట వ్యవసాయ అధికారి ఎస్. నరసింహం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వాడపల్లి పుణ్యక్షేత్రానికి ప్రత్యేక పోలీసు బలగాలు

**26 మంది పోలీసుల నియామకం.. జిల్లా ఎస్పీ రాహుల్ మీనాకు ఆలయ అధికారుల కృతజ్ఞతలు**



**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 17:**కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి పుణ్యక్షేత్రంలో భక్తుల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆలయానికి నిత్యం, ముఖ్యంగా పర్వదినాలు, ఉత్సవాల సందర్భంగా అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని 26 మంది ప్రత్యేక పోలీసు సిబ్బందిని నియమించింది.ఈ నిర్ణయంతో ఆలయ పరిసరాల్లో భద్రత మరింత బలోపేతం కానుందని పేర్కొంటూ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) రాహుల్ మీనాకు ఆలయ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ప్రత్యేక పోలీసు బలగాలను ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని వారు పేర్కొన్నారు.ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్య చక్రధర్ రావు మాట్లాడుతూ, వాడపల్లి పుణ్యక్షేత్రాన్ని సందర్శించే భక్తులకు సురక్షితమైన, ప్రశాంతమైన దర్శన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ దిశగా దేవాదాయ శాఖ, పోలీసు శాఖ పరస్పర సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

అదేవిధంగా, ఆలయంలో మౌలిక సదుపాయాల విస్తరణ, క్యూ లైన్ వ్యవస్థ బలోపేతం, ట్రాఫిక్ నిర్వహణ, పారిశుద్ధ్యం, తాగునీరు, విశ్రాంతి సదుపాయాల కల్పన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. భవిష్యత్తులో భక్తులకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ఆలయ అధికారులు వెల్లడించారు.

# కోనసీమ తిరుమలకు టెంపుల్ టౌన్ హోదా.. సీఎం ముందుకు ఎమ్మెల్యే బండారు ప్రతిపాదన





**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసిన ఎమ్మెల్యే బండారు**

**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 17:** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి క్షేత్రాన్ని రాష్ట్రంలో ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు టెంపుల్ టౌన్‌గా అభివృద్ధి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కోరారు. గురువారం ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే, కొత్తపేట నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

ఈ సందర్భంగా వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూపొందించిన సమగ్ర ప్రణాళికను ముఖ్యమంత్రికి అందజేశారు. క్షేత్రానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో రహదారులు, పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, వసతి, యాత్రికుల విశ్రాంతి కేంద్రాలు, క్యూ కాంప్లెక్స్‌లు తదితర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని వివరించారు. టెంపుల్ టౌన్‌గా అభివృద్ధి చేస్తే ఆధ్యాత్మిక పర్యాటకానికి కొత్త ఊపు లభించడంతో పాటు స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఎమ్మెల్యే వివరించినట్లు తెలిసింది.

అదేవిధంగా వాడపల్లి ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతి కల్పించే ఉద్దేశంతో ఆలయ ప్రాంగణంలో శ్రీనివాసం--2 వసతి గృహ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ ప్రతిపాదనపై టీటీడీతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.వాడపల్లి క్షేత్ర అభివృద్ధి ద్వారా కోనసీమ జిల్లాలో ఆధ్యాత్మిక పర్యాటకానికి మరింత ప్రాధాన్యం లభిస్తుందని, రాష్ట్రంలో ప్రముఖ వైష్ణవ క్షేత్రాల సరసన వాడపల్లి ప్రత్యేక గుర్తింపు పొందుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

తన వినతిపత్రంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారని, ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందించే దిశగా చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు.

## రైతులకు సౌకర్యవంతంగా ఎరువులు అందించాలి



**కిర్లంపూడి పెన్ పవర్ జూలై17:**రైతులకు సౌకర్యవంతంగా ఎరువులు అందేవిదంగా చర్యలు తీసుకోవాలని పిసిసి సభ్యులు ధరణాలకోట శ్రీను మండల వ్యవసాయ శాఖ అధికారిణి జోకా అమృతకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్బంగా ధరణాలకోట శ్రీను మాట్లాడుతూ రైతులకు యాప్ ద్వారా ఎరువులు ప్రభుత్వం సరఫరా చేస్తుంది కానీ స్మార్ట్ ఫోన్లు రైతులకు అవగాహన లేక ఓటీపీలు తెలియక ఇబ్బంది పడుతున్నారన్నారు.కనుక ఈ సమస్యపై ప్రత్తిపాడు రైతు భరోసా కేంద్రంలో ప్రత్తిపాడు మండల వ్యవసాయ అధికారిని జోకా అమృత గారికి పిసిసి సభ్యులు మరియు జిల్లా ఉపాధ్యక్షులు. ధరణాలకోటశ్రీను ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించడం జరిగిందన్నారు.రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు సరఫరా చేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో కొప్పన కోటేశ్వరావు, ఇరుగుల చక్రం, కందిమల్ల శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులందరూ పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



-మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి.

**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 17:** మండలంలోని రైతులందరూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)-ఖరీఫ్ 2026 పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి రైతులకు పిలుపునిచ్చారు.బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందిన రైతులకు బీమా ప్రీమియాన్ని బ్యాంకులే రుణం నుంచి మినహాయించి బీమా నమోదు చేస్తాయని తెలిపారు.పంట రుణం పొందని రైతులు మాత్రం సమీపంలోని సీఎస్సీ (మీ సేవ) కేంద్రాల ద్వారా బీమా ప్రీమియం చెల్లించి పీఎంఎఫ్‌బీవై పథకంలో నమోదు చేసుకోవచ్చని సూచించారు.బీమా నమోదు కోసం రైతులు సాగు చేస్తున్న పంట రకం,పంట విస్తీర్ణానికి సంబంధించిన స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించడంతో పాటు తప్పనిసరిగా పంట నమోదు (క్రాప్ రిజిస్ట్రేషన్) చేయించుకోవాలని తెలిపారు.2026 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి పంటను దిగుబడి ఆధారిత పంటగా,ప్రత్తి పంటను వాతావరణ ఆధారిత పంటగా బీమా పరిధిలోకి తీసుకువచ్చినట్లు వివరించారు.కాకినాడ జిల్లాలో వరి పంటకు ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ,ప్రత్తి పంటకు ఇఫ్కో,టోకియో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ బీమా సంస్థలుగా ఎంపికైనట్లు తెలిపారు.వరి పంటకు ఎకరానికి రూ.760 ప్రీమియం చెల్లించాల్సి ఉండగా,నమోదు గడువు ఆగస్టు 15 వరకు ఉందన్నారు.ప్రత్తి పంటకు ఎకరానికి రూ.2,000 ప్రీమియం ఉండగా,జూలై 24లోపు ప్రీమియం చెల్లించి బీమా నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు.ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనిశ్చితంగా ఉన్న నేపథ్యంలో రైతులందరూ పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకుని పంట నష్టాల నుంచి ఆర్థిక రక్షణ పొందాలని ఏఓ నాగం సుధా మాధురి కోరారు.

# మహిళా శిశు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత.

-వేలంక అంగన్వాడీ ఆయా పోస్టుకు నియామక పత్రం అందజేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ.



**కిర్లంపూడి,పెన్ పవర్, జూలై 17:**జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ పరిధిలో అంగన్వాడీ టీచర్,ఆయా పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు,యూనిఫామ్ చీరల పంపిణీ కార్యక్రమం జగ్గంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు.ఈ సందర్భంగా కిర్లంపూడి మండలం వేలంక గ్రామానికి చెందిన అంగన్వాడీ ఆయా పోస్టుకు స్థానిక నాయకుల సహకారంతో ఎంపికైన ములికి గీతా భవానికి స్థానిక నాయకుడు, కిర్లంపూడి మండలం తెలుగు యువత అధ్యక్షుడు గండే కాశీ విశ్వనాథ్ సమక్షంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్వయంగా నియామక పత్రం,యూనిఫామ్ చీరను అందజేశారు.మహిళా,శిశు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు.అంగన్వాడీ సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులు,గర్భిణులు,బాలింతలకు అందించే సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని,నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడపా భరత్,ఎస్వీఎస్ అప్పలరాజు,కొత్త కొండబాబు,కిర్లంపూడి మండల టీడీపీ అధ్యక్షులు వీరంరెడ్డి కాశీబాబు,కిర్లంపూడి మండలం తెలుగు యువత అధ్యక్షులు గండే కాశ విశ్వనాథ్,పీలా మహేష్ దితరులు పాల్గొన్నారు.

# ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడికి 'నేను సైతం' టీం, బిళ్లకుర్ర రైతుల వినతి



**కొత్తపేట, పెన్ పవర్, జూలై 17:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని బిళ్లకుర్రు ప్రాంత రైతులు, 'నేను సైతం' సామాజిక సేవా బృందం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో సాగునీటి సమస్యలు, ఇరిగేషన్ భూముల పరిరక్షణ, అధికారుల పనితీరుపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కారంలో మంత్రి చొరవను అభినందిస్తూ, కొత్తపేట నియోజకవర్గంలో మాత్రం ఇరిగేషన్, రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారుల సమన్వయం లోపించడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు మండలాల్లోని అనేక సమస్యలు అధికారుల నిర్లక్ష్యంతో పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.కొత్తపేట ఎమ్మెల్యే అభివృద్ధి పనుల కోసం నిధులు తీసుకురావడంలో కృషి చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అధికారులు ఆదేశాలను సమర్థంగా అమలు చేయడం లేదని తెలిపారు.దీంతో రైతులు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు.ఇరిగేషన్ భూములు, కాలువల గట్లు, చెరువుల పరిసరాల్లో అక్రమ నిర్మాణాలు పెరుగుతున్నాయని, వాటిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. అక్రమాలపై ఫిర్యాదు చేసే సామాజిక కార్యకర్తలకు బెదిరింపులు వస్తున్నాయని, అవసరమైతే తప్పుడు కేసులు పెడతామని హెచ్చరిస్తున్నారని కూడా తెలిపారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల స్పందన తెలియాల్సి ఉంది.ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా రైతులకు సకాలంలో సాగునీరు అందక పంటలు దెబ్బతింటున్నాయని, అన్నదాతల సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు. ఇరిగేషన్ భూముల పరిరక్షణ, అక్రమ నిర్మాణాల తొలగింపు, సాగునీటి సరఫరా మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి నిమ్మల రామానాయుడికి విజ్ఞప్తి చేశారు.రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించి, సంబంధిత శాఖల అధికారులను బాధ్యతాయుతంగా పనిచేసేలా ఆదేశించాలని 'నేను సైతం' టీం బిళ్లకుర్ర రైతులు ప్రభుత్వాన్ని కోరారు.

# బి సి వసతి గృహాన్ని తనిఖీ చేసిన జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,జులై 17:** కాకినాడ జిల్లా మండల కేంద్రమైన ప్రత్తిపాడులో ఉన్న బీసీ బాలికల వసతి గృహాన్ని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి శ్యామల కుమారి శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా వసతి గృహంలో గల సౌకర్యాలను, మరుగుదొడ్లు ,వంటశాల, వసతి గృహ పరిసరాలు రికార్డులు,రిజిస్టర్లు క్షుణ్ణంగా పరిశీలించచారు బాలికలకు అందిస్తున్న ఆహార పదార్థాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేసారు.ఈ సందర్భంగా శ్యామల కుమారి మాట్లాడుతూ విద్యార్థులకు వసతి గృహంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని స్థానిక వార్డెన్ శైలజారాణిని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, విద్యలో బాగా రాణించి బాలికలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం బీసీ సంక్షేమ శాఖ సహాయ అధికారి పి రామకృష్ణ సిబ్బంది ఎస్ సూర్యవతి, సూర్య కుమారి తదితరులు పాల్గొన్నారు.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# మెగా పేరెంట్--టీచర్ మీటింగ్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి





**కలెక్టర్ హరీంధ్ర ప్రసాద్**

**కాకినాడ, జూలై 17 ,పెన్ పవర్:** ఈనెల 24న నిర్వహించనున్న మెగా పేరెంట్--టీచర్ మీటింగ్ ను జిల్లా వ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరీంధ్ర ప్రసాద్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీఓలు, ఎంఈఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ మెగా పీటీఎం, షైనింగ్ స్టార్ సన్మాన కార్యక్రమాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు విద్యార్థుల ప్రగతిలో తల్లిదండ్రులను భాగస్వాములను చేయడమే మెగా పీటీఎం ప్రధాన ఉద్దేశమన్నారు. కార్పొరేట్ పాఠశాలలకే పరిమితమైన ఈ విధానాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కూడా అమలు చేస్తూ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.జిల్లాలోని అన్ని ప్రభుత్వ,ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ పాఠశాలలు,జూనియర్ కళాశాలల్లో ఒకేరోజు సమావేశాలు నిర్వహించాలని, అధిక సంఖ్యలో తల్లిదండ్రులు హాజరయ్యేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.పాఠశాలల మౌలిక వసతులు,బోధన,విద్యార్థుల పురోగతిపై తల్లిదండ్రుల నుంచి ప్రత్యక్ష ఫీడ్‌బ్యాక్ సేకరించాలని ఆదేశించారు. సమావేశాల హాజరు, ఫొటోలు, వీడియోలను లీప్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేసి డిజిటల్ పర్యవేక్షణ నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థుల విద్యా ప్రగతి,తరగతి గది ప్రవర్తన, సామాజిక అవగాహన తదితర అంశాలతో కూడిన సమగ్ర ప్రగతి పత్రాలను తల్లిదండ్రులకు అందజేయాలని,తక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను మందలించడం కాకుండా వారి బలహీనతలను గుర్తించి మెరుగుపరిచేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి కార్యాచరణ రూపొందించాలని సూచించారు.పిల్లలు ఇంట్లో చదువుకునేందుకు అనుకూల వాతావరణం కల్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు.

మెగా పీటీఎంను కేవలం సమావేశంగా కాకుండా ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసే జిల్లా స్థాయి విద్యా పండుగగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. దాతల సహకారంతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని,ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు.అలాగే షైనింగ్ స్టార్ విద్యార్థులకు వేదికపై తమ అభిప్రాయాలు వెల్లడించే అవకాశం కల్పించాలని ఆదేశించారు.ఈనెల 20న అన్ని పాఠశాలలు,జూనియర్ కళాశాలల్లో షైనింగ్ స్టార్ సన్మాన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పదో తరగతిలో వివిధ విభాగాల్లో 138 మంది, ఇంటర్మీడియట్‌లో 35 మంది విద్యార్థులను షైనింగ్ స్టార్స్‌గా ఎంపిక చేసినట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో డీఈఓ రమేష్, సమగ్ర శిక్ష ఏపీసీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

కోర్టు పబ్లికేషన్ యాడ్స్

కేవలం

యాడ్ 500/-

'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి


## సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలం: చిర్ల జగ్గిరెడ్డి

### బిళ్లకుర్రు డ్యామ్ కాలువ వద్ద రైతుల సమస్యలపై మాజీ ఎమ్మెల్యే పర్యటన







**కొత్తపేట, పెన్ పవర్, జూలై 17:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోనిబిళ్లకుర్రు గ్రామం సమీప డ్యామ్ కాలువను జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి కాలువను పరిశీలించిన ఆయన, నీరు లేక ఎండిపోయిన పంటకాలువలో బైక్ నడిపి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగునీరు అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులు సాగునీటి కోసం ఎండ్రిన్ సీసా పట్టుకుని నిరసన చేపట్టాల్సిన పరిస్థితి ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పలుమార్లు హామీలు ఇచ్చినా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేదని ఆరోపించారు.

ఉభయగోదావరి జిల్లాలో సాధారణంగా 11 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేసినా అన్ని పంటకాల్వలకు సాగునీరు చేరేదని, ప్రస్తుతం ప్రభుత్వం 14,700 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు చెబుతున్నప్పటికీ బోదులు, పంటకాల్వల్లోకి చుక్క నీరు కూడా చేరడం లేదని అన్నారు. ఇది పూర్తిగా నీటి నిర్వహణలో వైఫల్యమేనని పేర్కొన్నారు.

వేసవి కాలంలో కాలువల పూడికతీత, మరమ్మతులు, తూములు, గొర్రెపు డొక్కల తొలగింపు పనులకు కోట్ల రూపాయలు కేటాయించినట్లు ప్రకటించినా, క్షేత్రస్థాయిలో పనులు జరగలేదని ఆరోపించారు. ఫలితంగా నియోజకవర్గ ప్రారంభ ప్రాంతంలోనే నీరు నిలిచిపోగా, చివరి ప్రాంతాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.

దేవస్థానం భూములు కౌలుకు తీసుకుని, బ్యాంకుల నుంచి రుణాలు చేసి, బంగారం తాకట్టు పెట్టి సాగుకు సిద్ధమైన రైతులకు కనీసం సాగునీరు అందించలేకపోవడం ప్రభుత్వ వైఫల్యమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను నష్టాల్లోకి నెట్టారని విమర్శించారు.లక్షల టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తున్నా సరైన నీటి నిర్వహణ లేక రైతులకు ప్రయోజనం కలగడం లేదన్నారు. ఇప్పటికే కొందరు ప్రజాప్రతినిధులు, నీటి సంఘాల ప్రతినిధులు రాజీనామా చేయడం కూడా ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.బిళ్లకుర్రుతో పాటు కొత్తపేట నియోజకవర్గంలోని అన్ని పంటకాల్వలకు వెంటనే సాగునీరు విడుదల చేసి రైతుల పంటలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతులతో కలిసి ఇరిగేషన్ శాఖ కార్యాలయాలను ముట్టడించే ఉద్యమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉంటుందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపీ నిట్ లో పీహెచ్‌డీ, ఎంటెక్ విద్యార్థులకు మానసిక శ్రేయస్సుపై అవగాహన కార్యక్రమం







**తాడేపల్లిగూడెం, పెన్ పవర్ జూలై 17:** నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఎన్ఐటీ) లోని పీహెచ్‌డీ, ఎంటెక్ విద్యార్థులకు మానసిక శ్రేయస్సు అనే అంశంపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీ నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వరరెడ్డి కో ఆర్డినేటర్ గా వ్యవహరించారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ శ్రీవాణి టేకి మాట్లాడుతూ విద్యా, పరిశోధనా రంగాల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచాలంటే వృద్ధి దృక్పథం (గ్రోత్ మైండ్‌సెట్) ను అలవరుచుకోవటం ఎంతో ముఖ్యమని తెలిపారు. విజయవంతమైన జీవితానికి సానుకూల ఆలోచనా విధానం, నిరంతర అబ్యాసం, పట్టుదల ఎంతో కీలకమని తెలిపారు. గ్రోత్ మైండ్‌సెట్ ను ఓర్పు, కృషి, నిరంతర శ్రమ, సానుకూల వైఖరి, ప్రేరణ, క్రమశిక్షణ వంటి విలువల ద్వారా పెంపొందించుకోవచ్చని చెప్పారు. పరిశోధనలో ఎదురయ్యే సవాళ్లను అవకాశాలుగా మలుచుకోవడం, వైఫల్యాలను విజయానికి మెట్టుగా భావించి ముందుకు సాగడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవటం వంటి విషయాలు గురించి వివరించారు. మరో సైకాలజిస్ట్ లంక మైత్రి "ఇంపోస్టర్ సింద్రోమ్‌ను అధిగమించడం అనే అంశంపై మాట్లాడారు. మానసిక శ్రేయస్సే పరిశోధనల్లో విజయానికి బలమైన పునాది అని తెలిపారు. పరిశోధకుల్లో కనిపించే ఆత్మన్యూనత భావం, తమ సామర్థ్యాలపై అనుమానాలను అధిగమించే పద్ధతులు, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవడం, ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొని నిలబడటం వంటి అంశాల గురించి తెలియజేశారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యం, భావోద్వేగ స్థైర్యం, పరిశోధనలో మెరుగైన ప్రతిభ కనబరిచేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని వివరించారు. అనంతరం పిహెచ్డి ఎంటెక్ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

### ప్రధాన పంట కాలువ తవ్వకాలకు శ్రీకారం..

## రైతులకు సాగునీటి ఆశలు





**కాజులూరు, జూలై 17 ,పెన్ పవర్:** మంజేరు తణియేలు నుంచి శలపాక వరకు ఉన్న ప్రధాన పంట కాలువ తవ్వక పనులను శలపాక నీటి సంఘం అధ్యక్షుడు తాడి మాచారెడ్డి (టీఎంఆర్) ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. జేసీబీల సహాయంతో కాలువలో పేరుకుపోయిన తూట్లు, సిల్ట్‌ను రైతుల సమక్షంలో తొలగిస్తూ పనులు చేపట్టారు.కాలువ తవ్వక పనులను డీసీ లకాని చైతన్య, ఏఎంసీ వైస్ చైర్మన్ దడాల నాగార్జున నాగేశ్వరి, గౌర శీను, మంజేరు గ్రామ రైతులు పరిశీలిస్తూ పనులు సక్రమంగా జరిగేలా పర్యవేక్షిస్తున్నట్లు దడాల నాగార్జున తెలిపారు.ప్రధాన పంట కాలువను పూర్తిస్థాయిలో బాగుచేయడం ద్వారా తణుకువాడ, గొల్లపాలెం, శలపాక గ్రామాలతో పాటు శివారు ప్రాంతాల రైతుల పొలాలకు సాగునీరు సకాలంలో అందుతుందని స్థానిక రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## జగదాంబ అమ్మవారి ఆలయం ఉన్నచోటే పునర్ నిర్మించాలి



**జీలుగుమిల్లి, పెన్ పవర్ ,జులై 17 ;** స్థానిక శ్రీ జగదంబ అమ్మవారి ఆలయం ఉన్నచోటే నూతన పునర్నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు, గ్రామ పెద్దలు తీర్మానించారు. శుక్రవారం దేవాదాయశాఖ ఈవో టి లక్ష్మి, శ్రీ మద్ది ఆంజనేయ స్వామి ఆలయం సూపర్డెంట్ కే రంగారావు ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం విషయమై ఏర్పాటు చేసిన గ్రామసభలో గ్రామస్తులు ,గ్రామ పెద్దలు తన తీర్మానాన్ని తెలియజేశారు. అమ్మవారి ఉత్సవాలు 69 సంవత్సరాలుగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నారని అధికారులకు విన్నవించారు. అమ్మవారిని వేరేది చోటకు తరలించి ఆలయం నిర్మించడం అంటే గ్రామస్తులకు తీవ్ర మనోవేదన మిగల్చడమే అవుతుందని గ్రామస్తులు, గ్రామ పెద్దలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఉన్న ఆలయం చోట నూతన ఆలయాన్ని నిర్మిస్తే అందరికీ ఆమోదయోగ్యం అవుతుందని సంతకాల సేకరణతో పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఆలయ ఈవో టి లక్ష్మీ మాట్లాడుతూ గ్రామస్తులు సూచించిన విషయాలను ఉన్నత అధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆలయ కమిటీ చైర్మన్ చిర్రి వెంకటేశ్వరరావు, గడ్డ మణుగు సత్యనారాయణ, చాత్రాతి ప్రసాద్ చాత్రాతి భవాని శేఖర్,కోరుకొండ జనార్దన్ రావు, కోరుకొండ రామకృష్ణ, కోరుకొండ సూరిబాబు, కక్కిరాల చక్రి, గ్రామస్తులు పాల్గొన్నారు.

